
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి మెదక్
5
జిల్లాల వార్తలు
మంగళవారం 20 మే 2025



భవిత కేంద్రాల మరమ్మతుకు రూ.63 లక్షలు

సంగారెడ్డి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న భవిత కేంద్రాల మరమ్మతులకు సర్కారు నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 27 భవిత కేంద్రాలున్నాయి. ఒక్కో భవిత కేంద్రానికి రూ.1.5 లక్షల నుంచి రూ2 లక్షల వరకు వెచ్చించనున్నారు. ఈమేరకు జిల్లాకు రూ.63 లక్షల నిధులు కేటాయించింది. ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి భవిత కేంద్రాల ఆధునీకరణకు చర్యలు చేపడుతామని సమగ్రశిక్ష అభియాన్ సీఎంవో వెంకటేశం తెలిపారు.



మల్కాపూర్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

'భూ భారతి'లో 1,716 దరఖాస్తులు

కొండాపూర్ మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

కొండాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కొండాపూర్ మండలంలోని 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 5 నుంచి 12 రోజుల పాటు నిర్వహించిన సదస్సుల్లో 1,716 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. 23 రెవెన్యూ గ్రామల పరిధిలో 6,794 ఎకరాల ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న లబ్ధిదారుల నుంచి 500 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ భూముల సాగుచేసుకుంటున్నప్పటికీ ధరణి వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని, పట్టాదారు పాసుపుస్తకాలు అందలేని రైతులు ఫిర్యాదు చేశారు. వీటితోపాటు భూరికార్డుల్లో సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు, పేర్లలో తప్పులు, పట్టా బదిలీ, ఫౌతీ- తదితర సమస్యలపై మిగతా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

త్వరలోనే పరిష్కారం

భూ భారతి చట్టం ప్రకారం దరఖాస్తుల్లో వెయ్యికి పైగా సమస్యలకు ఆర్డీవో, మండల స్థాయిలో పరిష్కారం చూపే ఆవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను ఉన్నతాధికారుల అదేశాల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తులను అందించాలంటే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సమర్పించవచ్చని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

మేమున్నామని..

క్యాన్సర్, జీరియాట్రిక్ వార్డులు సిద్ధం

వయోవృద్ధుల ఆరోగ్యానికి భరోసా

క్యాన్సర్ బాధితులకు బాసట

సంగారెడ్డి జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులు

పది పడకల చొప్పున ఏర్పాటు

ఈ నెలలో వర్చువల్‌గా ప్రారంభానికి ఏర్పాట్లు





సంగారెడ్డి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జిల్లా కేన్సర్ చికిత్స వార్డు, వయోవృద్ధుల చికిత్స వార్డు (జీరియాట్రిక్-డే కేర్ సెంటర్) ప్రారంభానికి సిద్ధమయ్యాయి. జీజీహెచ్‌లోని పాలియేటిక్‌కేర్ వార్డును జిల్లా క్యాన్సర్ చికిత్స వార్డుగా, ఫిమేల్ మెడికల్ వార్డును వయోవృద్ధుల చికిత్స వార్డుగా ఆధునీకరించారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు రివాల్వింగ్ ఫండ్ కింద ఆ రెండు వార్డుల ఆధునీకరణకు రూ.10 లక్షల నిధులను ప్రభుత్వ మంజూరు చేసిన విషయం తెలిసిందే. టీజీఎంఎస్ఐడీసీ అధికారులు ఆ రెండు వార్డులను ఆధునీకరించి సిద్ధం చేశారు. వాస్తవానికి ఈ నెల 15వ తేదీనే ఆయా వార్డులు ప్రారంభించాల్సి ఉన్నా అనివార్యకారణాలతో వాయిదా పడింది. కాగా ఈ నెలాఖరు లోపు రెండు వార్డులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

వయోవృద్ధులకు ఉపయుక్తం

వయోవృద్ధుల సంక్షేమం కోసం డేకేర్ సెంటర్ల ఏర్పాటుకు సర్కారు నడుం బిగించింది. మధుమేహం, హైపర్‌టెన్షన్, గుండెజబ్బులు, ఆర్థ్రైటిస్ తదితర సమస్యలతో వయోవృద్ధులు వృద్ధాప్యంలో ఇబ్బంది పడుతున్నారు. జీజీహెచ్‌లో వీరికోసం 10 పడకల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తున్నారు. ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలను గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తారు. శారీరక, మానసిక, సామాజిక, ఆరోగ్య అంశాలను సమగ్రంగా పరిశీలిస్తారు. వృద్ధులు ఎదుర్కోబోయే సమస్యలను ముందస్తుగానే గుర్తించి చికిత్స అందిస్తారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సీనియర్ సిటిజన్లకు డేకేర్ సెంటర్ ఉపయుక్తంగా ఉంటుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు.

కేన్సర్ రోగులకు ఉపశమనం

చాపకింద నీరులా మానవాళిని కబలిస్తున్న కేన్సర్ మహమ్మారి నివారణకు ప్రభుత్వం బోధనాస్పత్రుల్లో ప్రత్యేకంగా వైద్య సేవలందించాలని నిర్ణయించింది. ఇప్పటికే జీజీహెచ్‌లో ఎనిమిది పడకలతో పాలియేటివ్ కేర్ వార్డు కొనసాగుతున్నది. పక్షవాతంతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఉపశమనం కలిగేలా వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఆ వార్డులోనే 10 పడకల జిల్లా కేన్సర్ చికిత్స వార్డు నెలకొల్పారు. దీంతో, బాధితులు హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందాల్సిన అవసరం ఉండదు. సమయం డబ్బు ఆదా అవుతుంది. రోగుల జీవన నాణ్యతను మెరుగుపరడంతో పాటు కేన్సర్ మహమ్మారితో పోరాడే సమాజ సామర్థ్యాన్ని పెంచేందుకు క్యాన్సర్ చికిత్స వార్డు దోహదపడనున్నది. సంగారెడ్డి జిల్లాలో 236 కేన్సర్ కేసులు, 393 మంది పాలియేటివ్‌కేర్ సర్వీసెస్ ద్వారా చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు.

తూకంలో జాప్యంపై నిరసన

శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతుల రాస్తారోకో

ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కరించాలని డిమాండ్

6



పిడుగుతో పైలం

ఉమ్మడి జిల్లాలో వింత వాతావరణం

ఉరుములు, మెరుపులతో పిడుగుపాట్లు

ఇటీవల ఇద్దరు బాలురు మృతి

మూగజీవాల మృత్యువాత

రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్త

7



రికార్డులకెక్కిన బుడతడు

నడకలో జాతీయ, అంతర్జాతీయ ఘనతలు సాధించిన రెండేళ్ల బాలుడు రుద్రాన్ష్

7

ఉగ్ర కదలికలతో ఉలికిపాటు

- నిందితుడు పది సిమ్ కార్డులు తెస్తే దొరికింది మూడే!
- మిగతా ఆరు సిమ్‌కార్డుల జాడెక్కడ?
- రూ.2 వేలకు ఒకటి చొప్పున పాకిస్థానీయులకు విక్రయం
- గొల్లపల్లిలో అస్సాం యువకుడి అరెస్ట్‌తో కలకలం
- భవన నిర్మాణ కార్మికులుగా ఇతర రాష్ట్రాల వ్యక్తులు
- సోషల్ మీడియాపై పోలీసుల నిఘా



గొల్లపల్లిలో నిందితుడిని పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న పోలీసు అధికారి

సంగారెడ్డి క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో సంబంధం ఉన్నవారిని జిల్లాలో అరెస్టు చేయడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పాకిస్థానీయులతో సంబంధాలున్న వ్యక్తిని మూడు రోజుల క్రితం అస్సాం పోలీసులు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో అదుపులోకి తీసుకోవడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. భారతదేశానికి సంబంధించిన సమాచారాన్ని కొందరు పాకిస్థాన్ మద్దతుదారులకు చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. పాకిస్తాన్‌కు మళ్లించబడిన మోసపూరిత సిమ్ కార్డులను ఉపయోగించి వాట్సాప్ ఖాతాలను సృష్టించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ సిమ్ కార్డులను సైబర్ నేరాలు, భారత వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించారని పోలీసులు కనుగొన్నారు. నకిలీ సిమ్ కార్డుల రాకెట్ అస్సాం, రాజస్థాన్, తెలంగాణ కేంద్రంగా నడుస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు, అస్సాం పోలీసులు స్పెషల్ ఈ రాకెట్‌ను ఛేదించారు. అస్సాం పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుల్లో ఒకడైన మొఫిజుల్ ఇస్లామ్ (19) సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిల్లో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అస్సాంలోని దుబ్రి జిల్లా బిలాస్‌పూర్‌కు చెందిన అతడు గతంలో అక్కడే ఓ మొబైల్ షాప్‌లో పనిచేసేవాడు. అస్సాం నుంచి తెలంగాణాకు వచ్చే సమయంలో పది సిమ్‌కార్డులు తెచ్చినట్టు పోలీసులు గుర్తించారు. ఒక్కో సిమ్ కార్డును రూ.2వేల చొప్పున విక్రయించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇస్లామ్ వద్ద ఫోన్‌లో ఉన్న దానితో పాటు మరో మూడు సిమ్ కార్డులు లభ్యం కాగా మిగతా ఆరు సిమ్‌కార్డులు ఎవరికి ఇచ్చాడన్న దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

సోషల్ మీడియాపై నిఘా

జిల్లాలో ఉగ్రమూలాల కదలికలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు జిల్లావ్యాప్తంగా జల్లెడ పడుతున్నాడు. ముఖ్యంగా సోషల్ మీడియాపై నిఘా పెట్టారు. ఎవరు ఎలాంటి మేసేజ్‌లు పంపుతున్నారో వాటన్నింటినీ నిషితంగా పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో ప్రతీ ఒక్కరిని విచారించారు. ముఖ్యంగా నిందితుడు ఇస్లామ్‌ను పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్‌తో పోలీసులు మాట్లాడారు. గత నెల రోజుల క్రితమే నిందితుడు ఇస్లామ్ జిల్లాకు వచ్చాడని, పదిరోజుల క్రితమే తన వద్ద తాపీ మేస్త్రీగా పనిలో కుదిరాడని సదరు కాంట్రాక్టర్ పోలీసులకు తెలియజేశాడు. దీంతో, చుట్టుపక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, కూలీలను విచారించారు.

వలస కార్మికులకు అడ్డా

జిల్లాలోని పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం, కొండాపూర్, హత్నూర, పాశమైలారం తదితర ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకే ఎక్కువగా ఉన్నారు. మరికొంత మంది భవన నిర్మాణ కార్మికులుగా, కూలీలుగా కూడా వివిధ చోట్ల పనిచేస్తున్నారు. గొల్లపల్లిలో ఘటనతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. పరిశ్రమల్లో, ఇతర కూలీ పనులు చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల కదలికలపై నజర్ పెట్టారు. ఆయా పరిశ్రమల్లో కార్మికులుగా నిజంగానే పనిచేస్తున్నారా? లేక మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా? సైబర్ నేరాలకు పాల్పడుతున్నారా? అనే విషయాలపై జిల్లా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు పరిశ్రమల్లో పనిచేస్తూ, ఖాళీ సమయాల్లో వారు చేస్తున్న కార్యకలాపాలపై పోలీసులు విచారిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏసీపీలు, డీఎస్పీల బదిలీ

తక్షణమే విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశం

సంగారెడ్డి క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మెదక్ జిల్లాలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీలు మధు, పురుషోత్తమ్‌రెడ్డికి స్థానచలనం కలిగింది. హుస్నాబాద్ ఏసీపీగా ఉన్న వి.సతీష్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. సిద్దిపేటలోని సీసీఎస్‌లో ఉన్న ఏసీపీ ఎ.యాదగిరి హైదరాబాద్‌లోని గాంధీనగర్ ఏసీపీగా బదిలీ అయ్యారు. బదిలీ అయిన డీఎస్పీలు వెంటనే వారి స్థానాల్లో చేరాలని డీజీపీ ఆదేశించారు.

నూతన డీఎస్పీలు వీరే...

సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ డీఎస్పీగా సైదా (ప్రస్తుతం నల్గొండ డీసీఆర్‌బీ), పటాన్‌చెరు డీఎస్పీగా ప్రభాకర్ (ప్రస్తుతం హైదరాబాద్ కంట్రోల్‌రూమ్) నియమితులయ్యారు. మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా నరేందర్ గౌడ్ (ప్రస్తుతం రాచకొండ కంట్రోల్ రూమ్), సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీలుగా రవీందర్‌రెడ్డి (ఇంటెలిజెన్స్ విభాగం), నర్సింహులు నియమితులయ్యారు.



రథాన్ని లాగుతున్న మంత్రి దామోదర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అందోలులో ఘనంగా రంగనాథస్వామి రథోత్సవం

వేడుకల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్పీకర్ ప్రసాద్‌కుమార్

జోగిపేట రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): అందోల్ గ్రామంలో కొలువుదీరిన భూనీలా సమేత రంగనాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తుల కోరికలు తీర్చే స్వామిగా విరాజిల్లుతున్న రంగనాథుడి ఉత్సవాల్లో చివరిఘట్టమైన రథోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం అట్టహసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై రథాన్ని లాగారు. అంతకుముందు వారికి ఆలయ అర్చకులు. ఉత్సవకమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు రథోత్సవాన్ని విద్యుత్‌దీపకాంతుల మధ్య వెలిగిపోతున్న రథం ఊరేగింపు కనుల పండగగా సాగింది. వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 22 కేంద్రాలు

- ఈ నెల 22 నుంచి ప్రారంభం
- హాజరు కానున్న 5,840 మంది
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 22 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, మధ్యాహ్నా వేళ్లలో జరిగే పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవత్సరంలో 3,626 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,214 మంది మొత్తం 5,840 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. 22 మంది సీఎస్, 22 డీవోలతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, సిట్టింగ్ స్క్వాడ్, కస్టడీయన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను నిల్వ చేయడం కోసం స్టోరేజి పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

37 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

వన మహోత్సవంలో భాగంగా మెదక్ జిల్లాలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను అదేశించారు. వివిధశాఖల వారీగా మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 37 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, అటవీ శాఖ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషిచేయాలని సూచించారు.

జహీరాబాద్‌లో సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

పరిశీలించిన ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

జహీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ డివిజన్‌లో ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారుల, నాయకుల హడావిడి మొదలైంది. సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటనలో భాగంగా ప్రారంభించనున్న అభివృద్ధి కార్యక్రమాల వేదికలను పరిశీలించారు. బహిరంగసభ నిర్వహించే ప్రాంగణం, హెలిప్యాడ్ కోసం స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధూరి, ఆర్డీవో రాంరెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించనున్న బసవేశ్వరుడి విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ

కేంద్రీయ విద్యాలయం పరిశీలన

ఝరాసంగం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మండల పరిధిలోని మాచునూర్ గ్రామ సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ రోడ్డును సోమవారం ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు.

లావణ్యకు కెమిస్ట్రీలో పీహెచ్‌డీ

పటాన్‌చెరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధన విద్యార్థిని లావణ్య కె. డాక్టరేట్ అర్హత సాధించారు. బయోమాక్రోమోలిక్యూల్స్‌తో కూమరిన్ అనలాగ్‌లను బంధించడం, వాటి యాంటీ ఆక్సిడెంట్ అధ్యయనాలపై, బయోఫిజికల్ అంతర్చ ర్యలపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ బిజయ కేతన్ సాహూ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

తూకంలో జాప్యంపై నిరసన


● రైతుల రాస్తారోకో
● సమస్య పరిష్కరించాలని డిమాండ్

శివ్వంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం సకాలంలో తూకం వేయలేదు. దీంతో రోజుల తరబడి రాత్రిపగలు కేంద్రం దగ్గర పడిగాపులు గాసే పరిస్థితి నెలకొందని అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిన పీఏసీఎస్ సిబ్బంది అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తూప్రాన్ నర్సాపూర్ జాతీయ రహదారి శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ముందు రోడ్డుపై సుమారు 50 మంది రైతులు సుమారు అరగంట ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘటన స్థలానికి ఎస్సై మధుకర్ రెడ్డి చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే తూకం వేసి లిఫ్టింగ్ చేయాలని సీఈవో మధుయాదవ్‌కు ఆదేశించారు. సందర్భంగా రైతులు హనుమంతు, వెంకటేష్ సత్తయ్య లు మాట్లాడుతూ 20 రోజుల క్రితం తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేయకపోవడంతో వర్షాలకు కళ్లంలో ధాన్యం తడుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టినందుకు పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరతతో సొంత ట్రాక్టర్లలో రైస్ మిల్లుకు ధాన్యం తీసుకువెళ్తే నాలుగు సంచుల వరకు తరుగు తీసి రైతులకు నష్టం చేస్తున్నారని వాపోయారు. కలెక్టర్ స్పందించి కళ్లంలో ఉన్న ధాన్యం లిఫ్టింగ్ అయ్యేలా రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బిజిలీపురం కృష్ణ, వీరేశం, సుక్క కృష్ణ, నాగేష్, గోపాల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


రైతులను సముదాయిస్తున్న ఎస్సై మధుకర్ రెడ్డి

కురిసిన వర్షం తడిసిన ధాన్యం

కొల్చారం, మే 19 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రాంపూర్, కిష్టాపూర్ ఐకేపీ సెంటర్లో భారీగా ధాన్యం ఉండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. లారీల కొరత పూర్తిగా ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే నిలువ ఉంచారు. ఇప్పటికైనా ఉన్నతాధికార స్పందించి రైతులను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సమస్యలను పరిష్కరించండి

మెదక్ అర్బన్/ నర్సాపూర్/సంగారెడ్డి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవానం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నులుమూలల నుంచి వచ్చిన ప్రజల తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో సమస్యలు పరిష్కరిస్తారని ఎంతో నమ్మకంతో ఇక్కడికి వస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన జంగయ్య అర్జీలో కోరారు. పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మెదక్ అర్బన్‌లో

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. అర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


న్యాయం చేయండి

రెండు ఎకరాలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటే ఆ డబ్బులు కట్టలేదని తనకున్న నాల్గు ఎకరాలు తీసుకుని మోసం చేశాడని తనకు న్యాయం చేయాలంటూ ఓ గిరిజన వృద్ధురాలు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో సోమవారం మొరపెట్టుకుంది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం నర్సాపూర్‌లో నివాసముండే లకావత్ రుక్మిణికి నాల్గు ఎకరాల భూమి ఉంది. అయితే నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద 50వేలు తీసుకుని రెండు ఎకరాలు తాకట్టు పెట్టింది. సకాలలో కట్టకపోతే రెండు ఎకరాలు రిజిస్టర్ చేసుకుంటానని చెప్పి తన పేరిట ఉన్న 4ఎకరాల 28 గుంటల భూమిని రిజిస్టర్ చేసుకుని మోసం చేశాడని ఈ విషయమై పలు మార్లు అధికారుల వద్ద మొర పెట్టుకున్న న్యాయం జరగలేదని మీరైనా న్యాయం చేయాలని ప్రజావాణిలో మొరపెట్టుకుంది. ఈ విషయంలో ఆమె చిన్న కుమారుడు మనస్తాపం చెంది సరిగా తిండి తినక అనారోగ్యానికి గురై చనిపోయినట్లు పేర్కొంది.



వాటర్‌ట్యాంక్ ఎక్కి మహిళ హల్‌చల్

నర్సాపూర్, మే 19(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి కాలనీకి చెందిన ఓ మహిళ వాటర్ ట్యాంకు పైకి ఎక్కి తనకు న్యాయం చేయాలంటూ లేకుంటే దూకుతా అంటూ హల్‌చల్ చేసింది. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానిక కాలనీకి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ పక్కింటి వారితో ఏదో విషయంలో గొడవ పడింది. ఈ గొడవ విషయంలో తనకు న్యాయం చేయాలని వారిపై చర్యలు తీసుకోవాలంటూ సమీపంలోని ట్యాంకు ఎక్కి దూకుతా అంటు మొండికేసింది. దీంతో సమాచారం పోలీసులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని చాలా సేపు వరకు బతిమాలి తనకు తగిన న్యాయం చేస్తామని బుజ్జగించి కిందకు దిగేలా చేశారు. దీంతో అప్పటివరకు ఆందోళన చెందిన స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

గాలి దుమారంతో విరిగిపడిన చెట్లు

● ప్రయాణికులకు అంతరాయం

దుబ్బాక /చేగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక, చేగుంటలో ఆదివారం కురిసిన ఈదురు గాలులకి చెట్లు విరిగిపోయి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చేగుంటలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన గాలి దుమారానికి రోడ్డు పక్కన చెట్లు విరిగివడి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. గమనించిన ప్రయాణికులు చెట్లను పక్కన తొలగించడంతో పెను ప్రమాదాలు తప్పాయి. సంబంధిత అధికారులు కనీసం విరిగిన చెట్లను తొలగించకపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


చేగుంట గజ్వేల్ రహదారిపై గాలి దుమారానికి రోడ్డుపై విరిగిపడిన చెట్లు

దుబ్బాకలో

దుబ్బాక పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వర్షంతో చెట్లు నేలకూలాయి. విద్యుత్ వైర్లుతెగిపడి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుబ్బాకపట్టణంలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆదివారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులతో కూడా భారీ వర్షంతో దుబ్బాక బస్ డిపోనుంచి, దర్మాజీపేట వరకు పలు చెట్లు కూలిపోయాయి. సోమవారం ఉదయం వరకు రహదారి స్తంభించింది. దర్మాజీపేటకు చెందిన జనగాం చంద్రయ్య ఇంటిముందు ఉన్న వేపచెట్టు మహావృక్షం నెలకొరిగింది. ఈదురుగాలులకు వేర్లతోసహా కూలిపోయింది. కూలిన చెట్టు జనగామ చంద్రయ్య, జనగామ రాజవ్వ ఇంటిమీద పడింది. చెట్లు కూలడంతో దర్మాజీపేట రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. మున్సిపల్ శానిటరీ అధికారి దిలీప్ ఆద్వర్యంలో వెంటనే రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. ఆదివారం పట్టణంలో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. రామసముద్రం చెరువువద్ద, పలు చోట్ల విద్యుత్‌వైర్లు తెగిపోవడంతోపాటు, చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

దివ్యాంగురాలు కామారెడ్డి వాసి

రామాయంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం దారుణ హత్యకు గురైన దివ్యాంగురాలి వివరాలను పోలీసులు గుర్తించారు. ఆ మహిళ కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గురజాల గ్రామవాసి మణెమ్మ అని తేలింది. ఈ నెల 12 న తొనిగండ్ల శివారు రహదారి పక్కన ఆమెను బండరాయితో తలపై మోపి చంపిన విషయం తెలిసిందే. అయితే గుర్తుతెలియని మహిళగా పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య జరిగిన నాటి నుంచి పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. ఎట్టకేలకు వారం రోజులకు కానీ సదరు మహిళ వివరాలైతే రాబట్టారు. కానీ దుండగులు ఆమెను హత్య చేయడానికి గల కారణాలు ఏమిటి? హత్య చేసింది ఎవరు? అన్న మిస్టరీ మాత్రం ఇంకా వీడలేదు.

ఎస్‌ఎన్‌సీయూలోనే లభ్యమైన శిశువు

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని నవజాత శిశు ఆరోగ్య కేంద్రం(ఎస్ఎన్‌సీయూ)లో లభ్యమైన ఆడ శిశువుకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 17 న ఎంసీహెచ్ పార్కింగ్‌లో 20 రోజుల ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి లభ్యమైన శిశువును ఎస్ఎస్‌సీయూ ఇంక్యూబేటర్‌లో పెట్టి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. శిశువు ఆరోగ్యంగా ఉందని, రెండు రోజుల తర్వాత శిశుగృహకు అప్పగిస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ తెలిపారు.


శిశువును పలకరిస్తున్న డా.అనీల్‌కుమార్











రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తూప్రాన్, మే 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ (రావెల్లి) సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము జగన్ (32) బోరు రిపేరర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తూప్రాన్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం లింగాపూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో కరీంగూడ చౌరస్తా సమీపంలో మూల మలుపు వద్ద ఎదురుగా వెళ్లి మిషన్ భగీరథ సంప్ హౌజ్ ప్రహారీ గోడను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగన్ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోద చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోహెడ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరేళ్ల గ్రామంలోని వడ్డెర కాలనీ సమీపంలో గల వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. వడ్డెర కాలనీకి చెందిన సంపంగి దుర్గయ్య అనే వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. పంచాయతీ కార్యదర్శి బి సతీష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు స్థానికుల సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఇది ఎప్పుడు జరిగింది? చనిపోయిన వ్యక్తి ఏ గ్రామానికి చెందినవాడు అనేది నిర్ధారించవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

చేగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీకొట్టింది.అతడికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి 44వ జాతీయ రహదారి బైపాస్ వద్ద జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు డ్రైవర్ కారును అతివేగముగా నడుపుతూ రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని ఒక వ్యక్తిని కారు ఢీకొనగా అతని తలకు కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ డిస్పెన్సరీలోనే
ఫేస్, థంబ్ వెరిఫికేషన్

● త్వరలో అందుబాటులోకి తెస్తామన్న ఆర్ఎం

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు వైద్య చికిత్సలు పొందేందుకు సాంకేతికంగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించేందుకు సంస్థ చర్యలు తీసుకుంది. ఇక నుంచి వారికి అందుబాటులో ఉండే ఆర్టీసీ డిస్పెన్సరీల్లోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ పరిశీలన ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ పరిశీలన సౌలభ్యం ఉండేది. ఈ క్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తార్నాక వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సంస్థ ఎండీ దృష్టికి ఉద్యోగులు తీసుకురావడంతో అందుబాటులో ఉన్న డిస్పెన్సరీలోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. కాగా సోమవారం ఆ ఉత్తర్వులను విశ్రాంత ఉద్యోగులు మెదక్ ఆర్ఎం ప్రభులతకు అందజేశారు. త్వరలో డిస్పెన్సరీలో ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ ప్రక్రియను అందుబాటులోకి తెస్తామని ఆర్ఎం హామీ ఇచ్చినట్లు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్‌కు విశ్రాంత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంను కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు బి.మురళి, బీకే.మూర్తి, మురళి, బాల్‌రాజ్, సత్తయ్య, నాగేశ్వర్, దుర్గరాములు, లక్ష్మారెడ్డి, మల్లేశం, జాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు

● ఆలయానికి రూ.60 లక్షల విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



తెల్లాపూర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెల్లాపూర్‌లో వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.60 లక్షల విరాళాన్ని అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ మధుసూధనచారి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్ బీఆర్ఎస్ పటాన్‌చెరు కో ఆర్డినేటర్ ఆదర్శరెడ్డి, రాంబాబు, నర్సింహరెడ్డి, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పిడుగుతో పైలం

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లికి చెందిన పంబాల ప్రసాద్(15), నడిపల్లి యశ్వంత్(13), మొకద్దం రవికిరణ్ (12)లు శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పెద్ద కుంట వద్ద క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో సమీపంలో ఉన్న చింత, మామిడి చెట్ల వద్దకు వెళ్లారు. ఒక్కసారిగా పెద్దశబ్దంతో వారు నిలబడిన చెట్టుపై పిడుగుపడటంతో ప్రసాద్, యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందారు.

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం గౌడ్‌గాంజన్‌వాడలో రైతు పుండ్లిక్ పటేల్ తన పొలంలో సోమవారం ఎద్దును మేపుతున్నాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో రూ.80 వేల విలువ చేసే ఎద్దు మృతిచెందింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు మనుషులతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రానున్నది వర్షాకాలం పిడుగుపాటుకు బలి కాకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

- ఉమ్మడి జిల్లాలో వింత వాతావరణం
- ఉరుములు, మెరుపులతో పిడుగుపాట్లు
- ఇటీవల ఇద్దరు బాలురు మృతి
- మూగజీవాల మృత్యువాత
- రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్త

మెదక్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తోడు భయంకరమైన శబ్దాలతో అక్కడక్కడ పిడుగులు కూడా పడుతున్నాయి. అజాగ్రత్తగా ఉంటే పిడుగుపాటుతో నిండుప్రాణాలు బలవుతాయి. అతేకాకుండా ఆరుబయట ఉండే మూగజీవాలకు ఎక్కువ ప్రమాదం పొంచి ఉన్నది. పిడుగల ధాటికి మూడు రోజుల క్రితమే సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో ఓ రైతు తన పొలం వద్ద కట్టేసిన గేదెలపై పిడుగు పడడంతో రూ.70వేలు విలువ చేసే పాడి గేదె మృతిచెందింది. రానున్న వర్షాకాలంలో పిడుగుపాటుతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తతతో వ్యవహరించాల్సిన అవసరమున్నది.

ఉరుములు, మెరుపుల వేళ జాగ్రత్తగా ఉండాలి

● మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న వేల వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమతంగా ఉండాలి. ఆ సమయంలో చెట్ల కిందకు, విద్యుత్ టవర్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు అస్సలు వెళ్లవద్దు.

● ఆరుబయట సెల్‌ఫోన్లలో మాట్లాడడం, వినియోగించడం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. వీలుంటే సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయాలి. ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరంగా ఉండాలి.

● వర్షం పడుతున్నప్పుడు చెట్ల కిందకు వెళ్లకూడదు. లోహపు భాగాలను తాకకుండా ఉండాలి. పొలం దున్నడం, పొలంలో ఇతర పనులను చేయడం వంటివి చేయకూడదు. వాన వస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో నిలిచిపోయి, ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటే మోకాళ్లపై కూర్చోని, రెండు చెవులు మూసుకోవడం శ్రేయస్కరం. పిడుగు పడే అవకాశాలు ఉన్నాయన్నపుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది.

● మూగజీవాలను పొలాల్లో, ఆరుబయట, చెట్లకింద అస్సలు విడువకూడదు. గేదెలు, ఆవులు, ఎద్దులను పాకలో కట్టేయడం శ్రేయస్కరం. హఠాత్తుగా వర్షాలు పడినప్పుడు గొర్రెలు, మేకలను కాపర్ల చెట్ల కిందకు అస్సలు తీసుకెళ్లవద్దు. విద్యుల్ లైన్‌ల కింద, ఎలక్ట్రిక్ పోల్‌లు, తాటి చెట్ల వద్ద మందలను ఆపకూడదు.

పిడుగుపాటు అంటే..

అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఆకర్షించుకున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాలు ఆకర్షించుకుని ఆకాశంలో మెరుపులు వస్తుంటాయి. ఈ సమయంలో మేఘాల్లోని నెగటివ్ కణాలను భూమిలోని పాజిటివ్ కణాలు ఆకర్షిస్తుంటాయి. అప్పుడు మెరుపుతో పాటు పిడుగు భూమిని తాకుతుంది. పిడుగు పడినప్పుడు 300 మిలియన్ వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 30 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత విడుదలవుతుంది. గంటకు లక్షకుపైగా కిలోమీటర్ల వేగంతో భూమిని చేరుతుంది. భూమిపై ఎత్తుగా ఉండే గుడి గోపురాలు, చెట్లు, గుట్టలు, సెల్ టవర్లు, విద్యుత్ స్తంభాలపై పిడుగు పడుతుంది.

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంగరంగ వైభవంగా ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. రంగురంగుల చమ్‌కీలు, పేపర్లు, వస్త్రాలు, మామిడికొమ్మలతో అలంకరించిన ఎడ్లబండ్లను గ్రామంలోని పురవీధుల గుండా డప్పుచప్పులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మాణిక్ ప్రభు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మక్తలక్ష్మాపూర్‌లో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

కేతకీలో మహారాష్ట్ర న్యాయాధికారి పూజలు

ఝరాసంగం, మే19 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామిని సోమవారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన దర్యాపూర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఓం శంకర్‌పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఈవో శివరుద్రప్ప సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఇది స్పెషల్ సమ్మర్ క్యాంపు

- 'డిజిటల్ డిటాక్స్ డ్రైవ్'తో వినూత్న ప్రయోగం
- స్ర్కీన్‌లను మరిచేలా పాత ఆటలతో హుషారు
- 21 రోజులు.. 21 శిక్షణ కార్యక్రమాలు
- చాంద్‌ఖాన్‌మక్తలో ఉపాధ్యాయుల చొరవ

గజ్వేల్/వర్గల్, మే 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో పాతకాలపు ఆటలన్నింటినీ పిల్లలు మరిచిపోయారు. పుట్టిన పాప నుంచి వృద్ధుల వరకు డిజిటలైజేషన్‌కు అలవాటు పడిపోయారు. సెల్‌ఫోన్ లేనిదే పాప పాలు తాగడం లేదు.. బాబు తినడం లేదు. కాసేపు ఇంట్లో కూర్చున్న సమయంలో సైతం టీవీ లేనిది ఉండడం లేదు. ఉదయం నుంచి మొదలు పెడితే రాత్రి పడుకునే వరకు డిజిటల్ పరికరాలతో కాలం గడిపేస్తున్నాం. పెద్దలు, పిల్లలు అందరూ వాటికే అలవాటైపోతున్నారు. దీంతో మానసిక ప్రభావం పడే ప్రమాదం ఉంది. వేసవి సెలవుల్లో పిల్లలను కనీసం పాతకాలపు ఆటలు తెలిసేలా, పుస్తకాల వైపు మళ్లించడం కోసం వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. 21 రోజుల పాటు పిల్లలకు డిజిటల్ డిటాక్స్ డ్రైవ్ చేపట్టాడు. స్ర్కీన్ నుంచి అంటే ఫోన్, టీవీ లాంటి వాటి నుంచి దూరంగా ఉంచేందుకు ప్రయత్నం చేయగా విజయవంతమైంది. ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించడంతో వారి మనసులో సామాజిక నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ విధానం పనిచేస్తుంది.



ఆటాలుడుతున్న విద్యార్థులు



డిటాక్స్ డ్రైవ్‌లో కార్యకలాపాలు

డిటాక్స్ డ్రైవ్‌లో భాగంగా అనేక కార్యకలాపాలను చేపట్టారు. స్ర్కీన్ రహిత రోజులు, బహిరంగ ఆటలు, క్రీడలు, కళ, సంగీతం, చేతిపనుల వర్క్‌షాప్‌లు, పఠన క్లబ్‌లు, మైండ్ ఫుల్‌నెస్ సెషన్‌లను నిర్వహించారు. 21 రోజులుగా విద్యార్థుల మానసిక ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి రోజుకు ఒక కార్యక్రమం చొప్పున 21 కార్యక్రమాలను చేపట్టారు. అవి ఫ్రీ హ్యాండ్ ఎక్సర్‌సైజ్, జంపింగ్ బాక్సెస్, సూర్య నమస్కారాలు, బ్రీతింగ్ వ్యాయామం, వాల్ పుషప్స్, బ్యాక్వర్డ్ రన్నింగ్, మంకీ వాక్, స్కిప్పింగ్, హూలా హూప్, ఫ్రాగ్‌రేస్, కంగారు జంపింగ్, బ్యాలెన్స్ స్టిక్ గేమ్, టో టచ్ ఎక్సర్‌సైజెస్, కూల్ డౌన్ ఎక్సర్‌సైజెస్, ఎలిఫెంట్ వాక్, బటర్‌ఫ్లై పోస్, క్రాస్ జంపింగ్, హై జంప్ హులాహూప్ లాంటివి నేర్పిస్తున్నారు. వీటి ద్వారా విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధికి బాటలు వేయడం ప్రధాన ఉద్దేశం. డిజిటల్ డిటాక్స్‌తో మెరుగైన మానసిక ఆరోగ్యం, దృష్టి పెంపు, సృజనాత్మకత, సామాజిక పరస్పర చర్యలు, సంబంధాలు, ఆరోగ్యకరమైన నిద్ర వంటి లాంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి.

సంతోషంగా ఉంది



నిజ జీవిత అనుభవాలతో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని సమతుల్యం చేయడం, వాటి ప్రాముఖ్యతను గ్రహించడంలో డిజిటల్ డిటాక్స్ డ్రైవ్ సహాయపడింది. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఎంతో హుషారుగా పాల్గొంటున్నాం.

-చిందం శ్రీనిధి, ఐదో తరగతి



మానసిక, శారీరక ప్రశాంతత కోసం

బాధ్యతాయుతమైన సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ప్రోత్సహిస్తూనే, విద్యార్థులను అవసరమైన జీవిత నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే మా లక్ష్యం. 21 రోజుల పాటు ఈ శిక్షణ శిబిరం సాగుతుంది. ఈ నెల 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం.

- వరాల ప్రశాంత్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు

రికార్డులకెక్కిన బుడతడు

నడకలో జాతీయ, అంతర్జాతీయ ఘనత సాధించిన రెండేళ్ల బాలుడు

సంగారెడ్డి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బుజ్జివయసులోనే ఓ బుడుతడు జాతీయ, అంతర్జాతీయ రికార్డులను నెలకొల్పాడు. రెండేళ్ల ప్రాయంలోనే కిలోమీటర్ల కొద్దీ నడిచి వాహ్‌వా అనిపించాడు. పటాన్‌చెరుకు చెందిన అపురూప, సత్యనారాయణరెడ్డి దంపతులు కుమారుడు రుద్రాన్ష్‌రెడ్డి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాడు. రుద్రాన్ష్‌రెడ్డి 47 నిమిషాల్లో 3.23 కిలోమీటర్ల దూరం ఏకకాలంలో నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. గంట వ్యవధిలో 4.29 కిలోమీటర్ల దూరం నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మరో ఘనత సాధించాడు. ఏప్రిల్ 9న 4.29 కిలోమీటర్ల ఏకకాలంలో నడిచినందుకు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్ఢ్స్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ని సొంతం చేసుకోవడం మరో విశేషం. రుద్రాన్ష్ తాత నరేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. ఆయన ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నడక ప్రాక్టీస్ చేయించి రికార్డులను సాధించేలా కృషి చేశారు.

అభినందించిన కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం రుద్రాన్ష్ రెడ్డి తల్లిదండ్రులు కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి బుడతడు సాధించిన రికార్డుల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రుద్రాన్ష్ తల్లిదండ్రులను, తాతయ్యను అభినందించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు విజయాన్ని అందుకుంటారని అన్నారు. బాల్యదశ నుంచే వారిని తీర్చిదిద్దాలన్నారు.



రెండేళ్ల చిన్నారి రుద్రాన్ష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పాశమైలారం పారిశ్రామికవాడలో విషాదం

● చార్మినార్ గుల్జార్ హౌజ్ ప్రమాదంలో మృతిచెందిన వారిలో తను పెట్రో కేమ్ కంపెనీ ఎండీ భార్య

● నివాళులర్పించిన కార్మికులు



రజనీ(ఫైల్)

పటాన్‌చెరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం జరిగిన చార్మినార్ గుల్జార్ హౌజ్ ప్రమాదంలో పాశమైలారం పారిశ్రామికవాడలోని తను పెట్రో కేమ్ కంపెనీ ఎండీ వినోద్ భార్య రజనీతో పాటు కుటుంబంసభ్యులు మృతిచెందడం విషాదాన్ని నింపింది. వినోద్ తన భార్య, కుమారుడితో కలిసి మూడు రోజుల క్రితం అత్తగారింటికి వెళ్లాడు. వినోద్ కుమారుడితో కలిసి శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేయగా రజనీ మాత్రం అక్కడ ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర ప్రమాదంలో వినోద్ భార్య రజనీతో పాటు రజనీ పుట్టింటికి చెందిన కుటుంబసభ్యులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో రజనీ తండ్రి ప్రహ్లాద్ మోదీ, తల్లి మున్నీ, సోదరుడు పంకజ్, వదిన వర్ష, సోదరుని పిల్లలు అనన్య మోదీ, ఇదికా మోదీ, ఇరాజ్, సోదరి శీతల్ జైన్, శీతల్ జైన్ పిల్లలు రిషబ్ జైన్, ఆరుషి జైన్ ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. గతంలోనే తను పెట్రో కెమ్ పరిశ్రమను విక్రయించడంతో ఇందులో పని చేసే పలువురు కార్మికులు వివిధ పరిశ్రమలలో పని చేస్తున్నారు. ఎండీ భార్య రజనీతో పాటు కుటుంబసభ్యులు పరిశ్రమ కార్మికులతో మంచి సంబంధాలు కలిగి ఉండేవారు. వారి మృతితో కార్మికులంతా తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పారిశ్రామికవాడలో రజనీ చిత్రపటానికి పూలమాల వేసి కార్మికులు నివాళులర్పించారు. మంచి వ్యక్తిత్వం గల రజని మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పరిశ్రమలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేసిన యామిని తెలిపారు.

కబ్జాలు చేస్తే ఊరుకునేది లేదు

● భూ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తా

● కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్బర్‌పేట- భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో 294 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. గతంలో ఎస్సీ కమిషన్ ద్వారా ప్రభుత్వం సేకరించిన భూమి ఎలా పట్టాగా మారిందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ అక్రమాలు జరిగాయని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు అమ్మితే కొనుగోలు చేశామని చెబుతున్నారని తెలిపారు. గతంలోనే ఈ భూములపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్‌కు విన్నవించామని ఆయన పేర్కొన్నారు. ఎనెగుర్తి గ్రామంలోనూ పెద్దఎత్తున భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌదర్‌పల్లి భూ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. దోషులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని పేదల భూమి గుంజుకునే ప్రయతం చేస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదన్నారు. ధరణి ద్వారా జవాన్ భూమి మార్పిడి చేసి కబ్జా చేశారని, ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మార్డి పెద్దచెరువును పరిశీలించిన అధికారులు



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, నీటిపారుదల శాఖ ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్హేర్, మే 19(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్, నల్లవాగు ప్రాజెక్టు ఏఈ అలేఖ్యరెడ్డి సోమవారం కబ్జాకు గురైన మార్డి పెద్దచెరువును పరిశీలించారు. 'మార్డి పెద్దచెరువు కబ్జా.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ వల్లూరి క్రాంతి, నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తిలు స్పందించారు. కబ్జాకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని, అలాగే చెరువు సర్వే పనులు ప్రారంభించి కబ్జాకు గురైన విషయాన్ని తేల్చాలని కల్హేర్ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన, నీటిపారుదల శాఖ ఏఈతో కలిసి చెరువును సందర్శించారు. కబ్జాకు గురైన స్థలాన్ని స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఇదిలా ఉండగా మార్డి గ్రామానికి చెందిన పెద్దచెరువు ఆయకట్టు రైతులు కబ్జాకు గురైన విషయమై సోమవారం ప్రజావాణిలోనూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు షురూ

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధర్యంలో అంతర్ జిల్లా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు సోమవారం ప్రారంభమయ్యాయి. కొండాపూర్ మండలం సీహెచ్.కోనాపూర్ ఎంఎ క్రికెట్ గ్రౌండ్‌లో సంగారెడ్డి-ఏ, సంగారెడ్డి-బి జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించారు. సంగారెడ్డి-బి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 43.3 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత సంగారెడ్డి-ఏ జట్టు 16 ఓవర్లలలో 74 పరుగులకు ఆలౌట్ అయింది. సంగారెడ్డి-బి జట్టుకు 146 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం సంగారెడ్డి-బి రెండో ఇన్నింగ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. మంగళవారం ఆట కొనసాగనున్నదని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

తూప్రాన్, మే 19(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తుండగా, మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ హాజరై తొలిరోజు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి రేణుక, సంయుక్త కార్యదర్శి రాజేందర్, జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

రాష్ట్ర ఉత్తమ ఐకేపీ సీసీగా సుధాకర్

కోహీర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీ కార్యాలయంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్(సీసీ)గా పనిచేస్తున్న సుధాకర్ రాష్ట్రంలోనే ఉత్తమ సీసీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను ఇటీవల హైదరాబాదులోని ప్రగతిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సుధాకర్‌ను సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కోహీర్ ఐకేపీ ఏపీఎం సమ్మయ్య సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రుణాల పంపిణీలో టార్గెట్ కంటే అధికంగా చేయడంతో ప్రభుత్వం గుర్తించిదని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆలయ పాలకవర్గం ఏర్పాటు కోసం ఉత్తర్వులు

జిన్నారం, మే, 19 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయ పాలకవర్గ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ తెలిపారు. ఆలయానికి ఫౌండర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహణ ఉండగా పాలకమండలి ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. త్వరలోనే ఆలయానికి నూతన పాలకవర్గ సభ్యుల నియామకం జరుగుతుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి ఏడురోజుల జైలు

గుమ్మడిదల, మే 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో పోలీసులపై దుర్భాషలాడిన వ్యక్తికి ఏడురోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్‌ఐ భరత్ భూషణ్ తెలిపారు. ఈనెల 17న గుమ్మడిదల చౌరస్తా వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన సోమన్నగారి నరేందర్ గౌడ్ అలియాస్ రాజుగౌడ్ మద్యం సేవించి పట్టుబడ్డాడు. మత్తులో పోలీసులను దుర్భాషలాడాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరచగా ఏడురోజుల జైలు శిక్ష విధించిందని ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సుబాష్‌గంజ్‌లో రోడ్డుపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరుతు అభ్యంతరం తెలుపుతు సోమవారం పట్టణంలోని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహ్మద్‌మక్సూద్, నరేష్‌కుమార్, సలీం, కలీం, కుమార్, రషీద్, ఏజాజ్ మాట్లాడుతూ ఇరుకుగా రోడ్డుపై నిర్మాణాలు చేపట్టడం వల్ల ముందు ముందు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆర్డీవోతో విచారం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆర్డీవో రాంరెడ్డి స్పందించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావును ఆదేశించారు.

రైతులు జాగ్రత్త వహించాలి

చిన్నశంకరంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో రైతులు జాగ్రత్త వహించి ధాన్యం బస్తాలపై టార్పలిన్ కవర్లను కప్పాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, గవ్వలపల్లి, సూరారం తదితర గ్రామాలను సందర్శించి, అర్ధరాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి



అంజనేయులు (ఫైల్)

పుల్‌కల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం కాంగ్రెస్ నాయకుడు వడ్ల ఆంజనేయులు(47) గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. సోమవారం తెల్లవారుజామున చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే గుండెపోటుకు గురై మృతిచెందారు. ఆంజనేయులు గ్రామస్థాయిలో క్రియాశీల నాయకుడిగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య పద్మ ఉన్నారు. అంత్యక్రియలకు పార్టీ చౌటకూర్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

● ఒకరికి గాయాలు

వెల్దుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటన హస్తాల్‌పూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నది. వెల్దుర్తి మండలానికి చెందిన భూపాల్‌రెడ్డి(బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు) ఉప్పులింగాపూర్ నుంచి తూప్రాన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హస్తాల్‌పూర్ గ్రామ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఇంతలో హెయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్థులు భూపాల్‌రెడ్డిని మరో వాహనంలో తూప్రాన్‌కు పంపించారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మాసాయిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. దేశాయి పేటకు చెందిన నాగేష్, నర్సింహులు బైక్‌పై వెళ్తున్నారు. రామంతాపూర్ జాన్సన్ పాఠశాల వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ సందీప్‌గౌడ్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో నాగేష్, నర్సింహులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే



ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, మే 19 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖేడ్, నిజాంపేట్ మండలాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు రూ.20.98 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు దత్తుగౌడ్, పండరిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నాగల్‌గిద్ద మండలం గుడూరు గ్రామంలోని వాటర్ పంప్ హౌస్‌లో 75 హెచ్‌పీ మోటార్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటివరకు తాగునీటి సమస్యకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు రూ.5 కోట్లు ప్రతిపాదనలు పంపగా, రూ.1.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. దీంతోపాటు ఇప్పటివరకు పైప్‌లైన్ మరమ్మతులు, మోటార్లు తదితర పనుల నిమిత్తం ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.3 కోట్లు కేటాయించామన్నారు. అనంతరం మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామ శివారులో రైతు మీరాబాయి, రావణ్‌కు ఎస్‌టీఎఫ్‌డీసీ నిధుల ద్వారా మంజూరైన బోర్‌ను ఎమ్మెల్యే కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివకృష్ణ, ఎంపీడీవో మహేశ్వర్‌రావు పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 25 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేట తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధు పాల్గొన్నారు.

వేసవి శిబిరం నిర్వహించడం గొప్ప విషయం

● మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్



అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో వేసవి శిబిరం ముగింపులో రాధాకిషన్

నర్సాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా వేసవి శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ అభినందించారు. నర్సాపూర్ మండలం అచ్చంపేటలోని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తన సొంత ఖర్చులతో స్థానిక విద్యార్థులకు వేసవి శిబిరం నిర్వహించి పలు అంశాలలో శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవోలు తారాసింగ్, బుచ్యానాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. నేటి నుంచి శిక్షణకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణలో మండల స్థాయిలో 112 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు, ఆరుగురు ఆర్‌పీలు పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందన్నారు.

ఇళ్లలో ఉంటున్నారా.. లేదా..?

● సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ లక్ష్మణ్

మెదక్ మున్సిపాలిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్నారా లేదా అని రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ లక్ష్మణ్ సిబ్బందితో కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసముంటున్న వారి జాబితాను పరిశీలించారు. గత ప్రభుత్వ హయంలో 575 మందికి పట్టాలివ్వగా.. నిర్మించిన భవనాల్లో ఉంటున్నారు. అయితే కొంతమంది వాటిని అద్దెకివ్వడం, మరొకరికి అమ్మడం, ఖాళీగా ఉంచడం చేస్తున్నారన్నారు. ఆరు బృందాలుగా వెళ్లి ప్రతి ఇంటి వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు తెలిపారు.

దేశ పౌరులపై దాడిచేస్తే సహించం

● ఎమ్మెల్సీ అంజిరెడ్డి ● సంగారెడ్డిలో ఘనంగా తిరంగా ర్యాలీ



సంగారెడ్డిలో తిరంగా ర్యాలీలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సంగారెడ్డి అర్బన్/పాపన్నపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : దేశ పౌరులపై దాడిచేస్తే సహించేది లేదని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సైనికులకు సంఘీభావంగా సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో సోమవారం సాయంత్రంతిరంగా ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఐబీ వరకు సాగిన ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ భారత దేశం వైపు కన్నెత్తి చూస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్ ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. భారతదేశ సైనిక శక్తి ఏమిటో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కే కాదు ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీందర్, రమేశ్, రాష్ట్ర నాయకుడు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటనర్సింహరెడ్డి, రాములు, చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు విజయ్, వాసు పాల్గొన్నారు. భారత త్రివిధ దళాల విజయానికి మద్దతుగా జిల్లా కేంద్రం మెదక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు సంతోష్‌చారీ అన్నారు. సోమవారం ఆయన కొత్తపల్లిలో మాట్లాడారు.

సంస్కారవంతమైన విద్య శిశుమందిరాల్లోనే..



సంస్కార సాధన ముగింపులో మాట్లాడుతున్న సంగ్రాంమహరాజ్

నారాయణఖేడ్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సంస్కారవంతమైన విద్య సరస్వతీ శిశుమందిరాల్లోనే సాధ్యమని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అన్నారు. సోమవారం సంస్కార సాధన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో విద్యార్థుల్లో దేశ భక్తి, క్రమశిక్షణ సంస్కారం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ చేపట్టామన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులకు చిత్రలేఖనం, లీఫ్ ఆర్ట్, శాస్త్రీయ నృత్యం, అభినయగేయాలు, యోగ్‌చాప్, డంబుల్స్, చక్కభజన, కర్రసాములో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి బాధ్యులు వీరేశలింగం, శివ్‌రాజ్, అర్థం చంద్రశేఖర్, పూర్వ అచార్యులు రాజయ్య, వీరారెడ్డి, పోశకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు మేలు

చేగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధితో పేదలకు మేలు చేకూరుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేగుంట ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.6.54 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ వెంగళరావు నాయకులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడి

మాసాయిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడి వస్తుందని గ్రామ కార్యదర్శి బీ.రాణి తెలిపారు. మండల కేంద్రమైన మాసాయిపేటలోని డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేశారు. కాగా సోమవారం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి గ్రామపంచాయతీ ద్వారా తయారైన వర్మీ కంపోస్టు ఎరువును కొనుగోలు చేశారు.

రామాయంపేటలో రోడ్లకు మోక్షం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రామాయంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ధ్వంసమైన రోడ్లకు మోక్షం కలగనుంది. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజానీకం కంకర తేలిన దారులతో నరకయాతన పడ్డారు. ఎట్టకేలకు పనులు మొదలవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచన మేరకు కాంగ్రెస్ నాయకులు పనులు ప్రారంభించారు. పిదప హైవే మీదుగా అంతర్గత ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడతారు. ఇందుకోసం నిధులు మంజూరైనట్లు టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు తెలిపారు. అడ్డదిడ్డంగా ఉన్న అంతర్గత రహదారిని విస్తరణలో భాగంగా 40 ఫీట్ల మేర కటింగ్ చేసి మురుగు కాలువలు, బీటీ రోడ్డు నిర్మిస్తారు. డివైడర్ ఏర్పాటు చేసి వీధిలైట్లు అమర్చనున్నారు.

చౌటకూర్‌లో మాంసం దుకాణం సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుల్‌కల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్‌లోని మాంస దుకాణాన్ని సీజ్ చేశారు. 'చౌటకూర్‌లో కుళ్లిన మాంస విక్రయాలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన వార్తకు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, చౌటకూర్ మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వసంతకుమారి స్పందించారు. ఈ మేరకు మండల వైద్యాధికారి విశాల్‌కు ఫోన్‌చేసి మాంస దుకాణాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు గ్రామంలో ధన్‌రాజ్ నిర్వహిస్తున్న మాంసం దుకాణాన్ని సీజ్ చేశారు.

సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సుధాభాస్కర్

సంగారెడ్డి రూరల్/పుల్‌కల్/నారాయణఖేడ్/హవేళిఘణపూర్/కొండాపూర్/వెల్దుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాభాస్కర్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, మల్లేశం పాల్గొన్నారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని చార్మినార్ బీరు పరిశ్రమలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సీబీఎల్ ఎంప్లాయీస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హవేళిఘణపూర్ మండలంలోని శమ్నాపూర్, హవేళిఘణపూర్ గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. శమ్నాపూర్‌లో ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండాపూర్‌లో సీపీఎం నాయకుల, వెల్దుర్తి మండలంలో సీపీఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



వెల్దుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి/నర్సాపూర్/శివ్వంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయమని టీపీసీసీ పరిశీలకుడు వరప్రసాద్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. అలాగే కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల పరిధిలోని గ్రామాలకు చెందిన గ్రామ అధ్యక్షుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముక్తబాయి, మండల అధ్యక్షురాలు శ్వేత, నాయకులు వెంకటరెడ్డి, నరేందర్‌రెడ్డి, శేఖర్, వెల్దుర్తి పట్టణ అధ్యక్షులు మల్లేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సంవిధాన్ బచావో...ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నర్సాపూర్‌లో ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూప్ తగాదాలకు తావు లేదని, చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే కూర్చోబెట్టి అందరినీ సమన్వయం చేస్తామని టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం శివ్వంపేట మండలంలోని గోమారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ బచావో, గ్రామ కమిటీల అధ్యక్షుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యతలో తేడా రావద్దు

● పంచాయతీరాజ్ ఎస్ఈ జగదీశ్వర్



చిమ్నాపూర్‌లో నూతనంగా వేస్తున్న బీటీరోడ్ల కొలతలు తీయిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ జగదీశ్వర్

కంది, మే 19 (ఆంధ్రజ్యోతి) : కంది మండల పరిధిలోని చిమ్నాపూర్, మక్తాఅల్లూరు గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్ల నాణ్యతలో తేడా రావద్దని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జగదీశ్వర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంది, చిమ్నాపూర్ గ్రామాల్లో బీటీరోడ్ల నాణ్యతను ఆయన డీఈ, ఏఈలతో కలిసి పరిశీలించారు. రోడ్డు పొడవు, వెడల్పులను టేపుతో కొలిపించి కాంట్రాక్టర్లకు అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ దీపక్, ఏఈలు శ్రీనాథ్‌రెడ్డి, అరవింద్, కాంట్రాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో 108 ఈఎంటీ మృతి

● బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న తెలంగాణ 108 స్టేట్ హెడ్ సుధాకర్, హెచ్ఆర్ హెడ్ కిరణ్‌కిషోర్

సంగారెడ్డి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా పనిచేస్తూ ఫిబ్రవరి 17న బోయిన నవీన్ మృతి చెందారు. విధి నిర్వహణలో ఈఎంటీ మృతిచెందిన నేపథ్యంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ సోమవారం హైదరాబాద్‌లో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును నామినీ పేరిట అందజేశారు. తెలంగాణ 108 స్టేట్ హెడ్ సుధాకర్, హెచ్‌ఆర్ హెడ్ కిరణ్‌కిషోర్ చేతులమీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థకు బోయిన నవీన్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుట్లలో వైభవంగా బీరప్ప జాతర



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్థులు

కంది, మే 19 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం ఆరుట్ల గ్రామంలో బీరప్ప జాతర సోమవారం వైభవంగా నిర్వహించారు. గొల్ల, కుర్మ, యాదవులంతా బీరప్పస్వామి విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను జరిపించారు. కొన్నేళ్లుగా గ్రామంలో బీరప్ప ఆలయం లేకపోవడంతో మాజీ సర్పంచ్ కాసాల ప్రసన్న ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డిని, మాజీ సర్పంచ్ ప్రసన్నరాంరెడ్డిలను, భూదాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గొల్ల, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపనలు

నారాయణఖేడ్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్లగిద్ద తండాలో సోమవారం భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరాకు చెందిన శేఖర్‌మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, ఇరక్‌పల్లి దేవిదాస్‌మహరాజ్‌లతో పాటు పురోహితులు మోహన్‌జ్యోషిల ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠాపన నిర్వహించారు.

బీరప్ప కామారతి కల్యాణోత్సవం

నారాయణఖేడ్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్పకామారతి కల్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడురోజులుగా కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు భూపాల్‌రెడ్డి చల్లగిద్దతండాలో నిర్వహించిన భవానీ మాత ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

చిన్నశంకరంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలు మూడోరోజూ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, పూర్ణాహుతి, తదితర పూజలను నిర్వహించారు. సాయంత్రం గ్రామదేవతలకు మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు.

హైవే విస్తరణకు సహకరించండి: ఎంపీడీవో

కంది, మే 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. కందిలో హైవే విస్తరణ కోసం రోడ్డు పక్కన ఉన్న కొన్ని షాపులను తొలగించాలని సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆ షాపుల యజమానులంతా ఎంపీడీవోతో తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం షాపులో యజమానులకు నష్టపరిహారం కచ్చితంగా ఇస్తుందని భరోసా కల్పించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కందిలోని షాపులను పరిశీలించి ఏ షాపుకు ఎంత ఇవ్వాలో నిర్ణయిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, బిల్ కలెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నిజాంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విత్తనాలు తీసుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, స్టాకు బోర్డులను షాపులలో ప్రదర్శించాలని, ప్రతిరోజు విత్తన, ఎరువుల క్రయ విక్రయాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. గుర్తింపు లేని ప్రదేశంలో ఉంచిన 30 క్వింటాళ్ల వరి విత్తనాలను కల్వకుంట గ్రామంలో స్వాధీనం చేసుకుని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన రెయిన్బో అగ్రిటెక్ సీడ్ డీలర్‌పై చర్యలకు సిఫారసు చేశామని తెలిపారు.

'అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాల్సిందే'

మెదక్ కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి) : మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాల్సిందేనని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ సీనియర్ నాయకుడు మాసాయిపేట యాదగిరి మాట్లాడుతూ అన్ని కుల సంఘాల భవనాల మాదిరిగానే.. అంబేడ్కర్ భవనాన్ని కూడా యధావిధిగా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అశోక్, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి దుబ్బాల సంజీవులు తదితరులు పాల్గొన్నారు.